క్లుప్తంగా

నేడు ఎస్‌కేఆర్‌లో జాతీయ సదస్సు

గూడూరు: పట్టణ సమీపంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28వ తేదీ సోమవారం మాదక ద్రవ్యాల వినియోగం- యువతపై వాటి దుష్పరిణామాలు అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, ముఖ్య వక్తలుగా విక్రమ సింహపురి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయినాథ్, తెలంగాణలోని నిజామాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కళారాణి హాజరవుతారని చెప్పారు. ఈ సదస్సుకు విద్యార్థులతో పాటు ఆసక్తిగల యువత కూడా హాజరై, మాదక ద్రవ్యాల వినియోగం ద్వారా కలిగే అనర్థాలను గురించి అవగాహన పెంపొందించుకోవాలని ఆయన కోరారు.

వైవీ రావుకు కార్మికుల నివాళి



రాపూరు ఆర్టీసీ డిపో ప్రాంగణంలో నివాళులు అర్పిస్తున్న ఎంప్లాయిస్ కార్మికులు

రాపూరు: ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏస్ అమరావతి సెక్రటరీ వైవీ రావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. దీంతో సోమవారం కార్మికులు రాపూరు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో వైవీ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిపో చీఫ్ అడ్వైజర్ రామ్మూర్తి, జిల్లా జాయింట్ సెక్రటరి శేషయ్య, అధ్యక్ష, కార్యదర్శులు వెంకటయ్య, శ్రీనివాసులు, గ్యారేజ్ కార్యదర్శి ఈశ్వరయ్య, కృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

150 యూనిట్ల పెరటి కోళ్ల అందజేత



కోళ్లను అందజేస్తున్న భానుప్రసాద్, ఏపీఎం రాధ

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో సోమవారం పొదుపు మహిళలకు 150 యూనిట్లు పెరటి కోళ్లను లైవ్ స్టాక్ డీపీఎం భానుప్రసాద్, ఏపీఎం రాధ అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పొదుపు సభ్యులు ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించేందుకు పెరటి కోళ్ల యూనిట్లను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఒక్కో యూనిట్ రూ.3500 వంతున అందజేసినట్లు ఆయన చెప్పారు. ఒక్కో యూనిట్‌కు 10 కోళ్లు ఉంటాయని తెలిపారు. కోళ్లతో పాటు ఉచితంగా దాణా కూడా అందించినట్లు చెప్పారు. యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలింగ్ అధికారుల నియామకం

తడ: వచ్చే నెలలో జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ అధికారులుగా మండలానికి చెందిన నలుగురు అధికారులను ఎన్నికల కమిషన్ నియమించింది. వీరిలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవానీ, ఇరిగేషన్ ఏఈ కృష్ణయ్య, వ్యవసాయ శాఖ ఏఓ జ్యోతిర్మయి ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



నెలబల్లిలో సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ వాణి

దొరవారిసత్రం: నెలబల్లి పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను గూడూరు డివిజన్ డీఎల్‌డీఓ వాణి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలో జరుగుతున్న జగనన్న కాలనీలో గృహనిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఆమె వెంట ఎంపీడీఓ సింగయ్య, పంచాయతీ కార్యదర్శి మునికృష్ణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కంటి అద్దాల పంపిణీ



రైతులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

గూడూరురూరల్ : మండలంలోని పాలిచెర్ల సచివాలయంలో ఐసీబీసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియా విజన్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో నిమ్మ, పాడి రైతులకు ఇటీవల కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ మేరకు సోమవారం కంటి అద్దాలు అవసరమైన రైతులకు సర్పంచ్ కాటంరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఫౌండేషన్ జిల్లా అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, ఏఎస్ఎం కుమారి, ఆశ కార్యకర్త, కమ్యూనిటీ ఫెసిలిటేటర్లు, రైతులు పాల్గొన్నారు.

శరవేగంగా గృహ నిర్మాణాలు

గ్రామాల్లో ఇప్పుడు ఎటు చూసిన జగనన్న కాలనీల్లో వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లు కనిపిస్తున్నాయి. గ్రామాలుగా ఏర్పాటు అవుతుండడంతో సరికొత్తగా కనిపిస్తున్నాయి. ఇన్నేళ్లకు సొంతింటి కల నెరవేరనుండడంతో పేదల ఆనందానికి అవధుల్లేవు. దీనికితోడు నిరంతరయాంగా అర్హత ఉన్న ప్రతి నిరుపేదకు ఇంటిని మంజూరు చేస్తూ వారి కలలను నిజం చేసేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయి.

- పీఎం ఆవాస్ యోజన కింద 376, నుడా పరిధిలో 279 గృహాలు మంజూరు
- వివిధ దశల్లో ఇంటి నిర్మాణాలు
- కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక కృషి
- ఉగాది నాటికి సామూహిక గృహప్రవేశాలకు సమాయత్తం



రాచపాళెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు



వెంకటరెడ్డిపాళెంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలిస్తున్న ఏఈ శివప్రసాద్

ఓజిలి: పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపడుతున్న విషయం విదితమే. మండలంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 376 ఇళ్లు, నుడా పరిధి కింద 279 ఇళ్లను మంజూరు చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన వాటిలో 70 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, నుడా పరిధిలో 170 ప్రారంభం దశలో ఉన్నాయి. సుమారు 70 ఇళ్లు పూర్తి కావొచ్చాయి. అధికారులు కూడా లబ్ధిదారులతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఊపందుకున్న నిర్మాణాలు..

మండల పరిధిలోని పెదపరియ, వెంకటరెడ్డిపాళెం, జోష్యులవారికండ్రిగ, గ్రద్దగుంట, పినపరియపాడు, రాచపాళెం, కొత్తపేట తదితర గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఉగాది నాటికి సామూహిక గృహప్రవేశాలకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండడంతో ఇప్పుడు అంతటా ఇళ్ల నిర్మాణాలు చకచకా జరుగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేయడంతో పాటు, తక్కువ ధరకే సిమెంట్ అందిస్తోంది. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారు డ్వాక్రా సంఘాల్లో లబ్ధిదారులుగా ఉంటే వారికి తక్కువ వడ్డీకే స్త్రీనిధి రుణాలు కూడా అందిస్తోంది. దీంతో ఇంటి నిర్మాణాల పూర్తికి లబ్ధిదారులు చొరవ చూపుతున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి..

అలాగే జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయం విదితమే. ముఖ్యంగా రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు ఏర్పాటుకు అధికారులు కూడా ప్రత్యేక చొరవ చూపుతున్నారు. నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇళ్ల నిర్మాణాల పూర్తికి లబ్ధిదారులకు పలు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ప్రస్తుతం ఎటు చూసినా దాదాపు పూర్తి కావస్తున్న ఇళ్లే కనిపిస్తున్నాయి. త్వరలోనే సొంతింటి కల నెరవేరనుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

> **ఉగాదికి నిర్మాణాలు పూర్తి**
>
> మండలంలో ఇళ్ల నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. ఇళ్లు మంజూరైన వెంటనే లబ్ధిదారులు ముందుకొచ్చి నిర్మించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉగాది పండుగ నాటికి ఇంటి నిర్మాణాలు పూర్తి చేయించి, సామూహిక గృహప్రవేశాలు చేయిస్తాం.
>
> – శివప్రసాద్, హౌసింగ్ ఏఈ, ఓజిలి

మాయమవుతున్న కాలువ గట్లు



జేసీబీతో తవ్వేస్తున్న తెలుగుగంగ కాలువ గట్టు

చిల్లకూరు: రైతులకు సాగు నీరు అందించే తెలుగుగంగ కాలువకు సంబంధించిన గట్లను కొందరు అక్రమంగా తవ్వి తరలిస్తుండడంతో అవి మాయమవుతున్నాయి. అధికారులు ప్రధాన కాలువల మీదే దృష్టి పెడుతుండడంతో అటవీ ప్రాంతాల్లో ఉండే కాలువల గట్లను కొందరు అక్రమార్కులు తవ్వి అక్రమంగా అందులో గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే చిల్లకూరు మండలం వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో రెవెన్యూ కార్యాలయానికి కిలోమీటరు దూరంలో ఉన్న తెలుగు గంగ కాలువ గట్లను సోమవారం కొంతమంది అక్రమంగా తవ్వి ట్రాక్టర్లలో మట్టిని తరలించి లేఅవుట్‌లలో రోడ్లకు వినియోగిస్తున్నారు. దీనిపై స్థానికులు రెవెన్యూ, తెలుగుగంగ అధికారులకు సమాచారం ఇచ్చినా వారు స్పందించలేదు. ఇలానే కొనసాగితే మంచి వర్షాలు వచ్చినప్పుడు కాలువలో నీటి ఉధృతికి కట్టలు తెగిపోయే ప్రమాదం ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమంగా గ్రావెల్ తరలించే వారిపై చర్యలు చేపట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి చేయండి

- సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: తూర్పు రాయలసీమ నియోజకవర్గ(ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం) జిల్లాలకు సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరచిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం ఆయన నాయుడుపేట పట్టణంలోని నవోదయ, విశ్వభారతి స్కూళ్లకు వెళ్లి అక్కడి పట్టభద్రులను కలసి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ తరపున బలపరచిన అభ్యర్థులు శ్యాంప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి సీఎం జగనన్నకు కానుకగా ఇవ్వాలన్నారు. పేర్నాటి చారిటబుల్ ట్రస్టు పేరిట ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ అందరివాడిగా పేరు తెచ్చుకున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్ రెడ్డికి, అదేవిధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్ రెడ్డిని ఆదరించాలని కోరారు. ముందుగా ఆయన నవోదయ పాఠశాల కరస్పాండెంట్, ప్రైవేటు పాఠశాలల సంఘ నాయకులు పద్మనాభ రెడ్డి, విశ్వభారతి పాఠశాల కరస్పాండెంట్ గోపాల్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమై తమ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థుల విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ మాధవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, టీఎంఆర్ విద్యాసంస్థలకు చెందిన తంబిరెడ్డి మనోహర్ రెడ్డి, నాయకులు విజయులు రెడ్డి, రవి, చదలవాడ కుమార్, జయరామయ్య, నాగార్జున, రాహుల్, రవి ఉన్నారు.

> **సూళ్లూరుపేటలో..**
>
> సూళ్లూరుపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి, చంద్రశేఖర్‌రెడ్డి గెలుపునకు పీఓసీ సభ్యులంతా కృషి చేయాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోరారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో తడ, సూళ్లూరుపేట అర్బన్, రూరల్, దొరవారిసత్రం మండలాలకు చెందిన పీఓసీ సభ్యులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం అంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, పట్టణపార్టీ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి మూడు మండలాల పీఓసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

పెళ్లకూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు నాయుడుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య అన్నారు. సోమవారం మండలకేంద్రం పెళ్లకూరులోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మండల విద్యావనరుల కేంద్రం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు తగిన బందోబస్తు సిద్ధం చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలతో పాటు భద్రతా ఏర్పాట్లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆయన వెంట ఎంపీడీఓ సురేష్‌బాబు, ఎంఈఓ సుబ్రమణ్యం, ఎస్ఐ కృష్ణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మెరుగైన సేవలు అందించండి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ

సూళ్లూరుపేట రూరల్ : గ్రామ సచివాలయాల్లో ఏపీ సర్వీసెస్ చాల తక్కువగా ఉండాయని వాటిని పెంచాలంటూ డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఇ.వాణి తెలిపారు. సూళ్లూరుపేట మడలంలోని కేసీ ఎన్‌గుంట, కోటపోలూరు-1, కోటపోలూరు-2 సచివాలయాలను ఆమె సోమవారం పరిశీలించారు. సచివాలయాల రికార్డులను తనిఖీ చేసి ప్రజలకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల్లో ఈ సర్వీసెస్ చాలా తక్కువగా ఉన్నాయని, ఆ సంఖ్య మరింత పెంచాలని సూచించారు. సచివాలయాల్లో ఎస్‌డీజీ సర్వేలకు సంబంధించిన ఏఎస్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రమీలారాణీ, ఐసీడీఎస్ సీడీపీఓ శారదాంబ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల సమస్యల పరిష్కారమే ధ్యేయం



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

గూడూరు: చిరు వ్యాపారులు సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రథమ మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, చంద్రయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో మార్చి 3, 4 తేదీల్లో గూడూరు నిర్వహించనున్న చిరు వ్యాపారుల ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని, సభల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ని షాపింగ్ మాల్స్, పెద్ద దుకాణాలు ఏర్పాటైనా, పాలు, పండ్లు, కూరగాయలు నిత్యావసర సరుకులను ప్రజలకు చేరవేయడంలో కీలకపాత్ర చిరువ్యాపారులదే అన్నారు. ఈ మేరకే జిల్లాలోనే తొలిసారిగా గూడూరు పట్టణంలోనే ప్రథమ మహాసభలను నిర్వహిస్తున్నామని, ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కే కాలేషా, శశికుమార్, వెంకటేశ్వర్లు, చాన్‌బాషా, బాబు, నరసమ్మ, పెంచలమ్మ ఉన్నారు.

పూజా సామగ్రి వితరణ

వాకాడు: మండల కేంద్రమైన వాకాడు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి సోమవారం శ్రీ సీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో పంచలోహ పూజాసామగ్రిని అందజేశారు. ప్రవాస భారతీయులు పాలవలస వెంకటసాయి పూర్ణచంద్రరావు, మీనా దంపతుల దాతృత్వంతో ఆలయానికి శఠారి, హారతి పళ్లెం, పంచపాత్రలు తదితర పూజా సామగ్రిని సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, రాష్ట్ర బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అండగా ఉంటా



చంద్రశేఖర్‌రెడ్డితో ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులు

గూడూరు: ఉపాధ్యాయులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారనికి కృషి చేస్తానని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పీవీఆర్ కల్యాణ మండపంలో పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యంతో ఆయన సోమవారం సాయంత్రం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెడ్ క్రాస్ చైర్మన్‌గా తను విశేష సేవలందించినట్లు చెప్పారు. మొదటి ప్రాధాన్యత ఓటును తనకు ఓసి, గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. అనంత రం ప్రైవేటు విద్యాసంస్థల కరస్పాండెంట్లు ఆయనను ఘనంగా సత్కరించారు. ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుబ్బారెడ్డి, దశరథరామిరెడ్డి, బాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్తలు

వెంకటగిరిరూరల్: శాస్త్రీయ పద్ధతిలో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అంబాజీపేట కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు, స్థానిక కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గోవిందరాజులు అన్నారు. స్థానిక కృషివిజ్ఞాన కేంద్రంలో సోమవారం 6వ శాస్త్రీయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నిమ్మ, మామిడి, కూరగాయల పంటల సాగు సమయంలో శాస్త్రవేత్తల సూచనలు పాటించాలన్నారు. రైతులు తమ సమస్యలను శాస్త్రవేత్తలను కలిసి నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖాముఖి, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమాన్ని అధికారులకు, రైతులకు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా చూపించారు. జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏడీఏ నాగార్జునసాగర్, పశుసంవర్ధక శాఖ అధికారి కిషోర్, నిమ్మ, చీనీ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మధుమతి, ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద తనిఖీ

దొరవారిసత్రం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈఓ మస్తానయ్య సూచించారు. సోమవారం ఆయన మండలంలోని తొగరాముడి పంచాయతీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలును తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అదేవిధంగా పాఠశాలల రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. హెచ్ఎం రామ్మోహన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

డీవీ సత్రానికి చేరిన పాదయాత్ర

దొరవారిసత్రం: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలంటూ సూళ్లూరుపేట నుంచి మొదలైన ఎంఆర్పీఎస్ చేపట్టిన సంగ్రామ పాదయాత్ర మంగళవారం దొరవారిసత్రానికి చేరుకుంది. ఈసందర్భంగా ఎంఆర్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాస మాదిగ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన నూరు రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి తొమ్మిదేళ్లు కావొస్తున్న నేటికీ ఏమి పట్టనట్లు బీజేపీ ప్రభుత్వం ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే బీజేపీతో మాదిగలు యుద్ధం చేసేందుకు సిద్ధం కావాలని కోరారు. పాదయాత్ర నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, విజయవాడ మీదుగా సాగి మార్చి 15న రాజధానిని ముట్టడిస్తామన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టకపోతే బీజేపీకి మాదిగలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, వెంకటేశ్వర్లు, సురేష్, నాగేశ్వరావు, పాండు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సరుకులు పంపిణీ

గూడూరు: దివ్యాంగులకు ఫల సరుకులు పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమని ప్రముఖ ఆడిటర్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు తెలిపారు. స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్లో గూడూరు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగులకు సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా మూలి హరనాథ్ రెడ్డి వ్యవహరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు నెలకు సరిపడా సరుకులు అందజేస్తూ వారిని ఆదుకోవడం ఎంతో అభినందించాల్సిన విషయమని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ధనుంజయరెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, సన్నత్‌కుమార్ రెడ్డి, వాసుగౌడ్, బాలరామిరెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్ఫూర్తి సీవీ రామన్



విద్యార్థులు రూపొందించిన సైన్స్ పరికరాలను తిలకిస్తున్న ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ సాయికృష్ణ

వెంకటగిరి: సాంకేతికతలో దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పిన సీవీ రామన్ స్ఫూర్తితో విద్యార్థులు రాణించి నూతన అంశాలను ఆవిష్కరించాలని ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర తెలిపారు. స్థానిక ఆర్‌వీఎం ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ప్రదర్శనలను తిలకించి అభినందించారు. పాఠశాల పూర్వ విద్యార్థి శ్రీనివాసులు ఎన్‌సీసీ కోటాలో బీడీఎస్ వైద్యసీటును సాధించడంతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, హెచ్ఎం శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేరిగకు అభినందనల వెల్లువ



మేరిగకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

గూడూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవమైన మేరిగ మురళీధర్‌ను పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. నెల్లూరులోని డీఆర్ ఉత్తమ్‌లో సోమవారం గూడూరు నియోజకవర్గ నాయకులు ఓడూరు బాలకృష్ణారెడ్డి, చిట్టేటి నారాయణతో పాటు, సూళ్లూరుపేటకు చెందిన కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి తదితరులు మేరిగను కలిసిన వారిలో ఉన్నారు.

శాలువలతో సత్కారం..

చిల్లకూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవమైన మేరిగ మురళీధర్‌ను చిల్లకూరు మండలం తిక్కవరం వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం నెల్లూరులో కలుసుకుని శాలువ కప్పి, తిరుపతి వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఎమ్మెల్సీని కలసిన వారిలో నాయకులు మదన్‌కుమార్ రెడ్డి, జయశేఖరరెడ్డి, రఘు తదితరులు ఉన్నారు.

